
# శతాబ్ద ప్రస్థానం

## నా జ్ఞపకాలు




సూరి రామకృష్ణ శాస్త్రి



చతుర్వేదుల. వెంకటసత్యనారాయణ మూర్తి

## ముందు మాట:

సూరి. రామకృష్ణ శాస్త్రిగారు మా పెద్దమేనమామ-తను పుట్టినది పశ్చిమ గోదావరి జిల్లాలోని నిడదవోలు పట్టణం. ప్రేమ ఆప్యాయాలతో బాటు -అయనకున్న విషయ పరిజ్ఞానం, మేధస్సు,ధారణా శక్తి అపూర్వం.

నా చిన్నతనం నుంచి మామయ్య బాగా అలవాటు, చనువు కూడా - నాకు చిన్నప్పటినుంచి బంధువులు, ఆప్తుల ఇళ్ళకి తరచుగా వెళ్లడం అలవాటుగా ఉండేది. ఆయన చెప్పే విషయాలు జిజ్ఞాస కలిగించేవి, నాకు తెలియనివి,స్వతంత్రం రాకముందు విషయాలు కూడా చాలా చెప్పేవారు. "మద్రాస్ కాంపోజిట్ స్టేట్ గా" ఉన్నప్పటి కబుర్లు( ఆంధ్ర రాష్ట్ర అవతరణ కాకముందు) టంగుటూరి ప్రకాశం పంతులు గారి గురించి, పొట్టి శ్రీరాములు గారి గురించి, అక్కడ స్కూళ్ల లో తెలుగు మాధ్యమంలో చదువు ఉండటం గురించి-క్రమేపీ తెలుగుని వెనక్కి నెట్టడం గురించి- మరెన్నో విశేషాలు అడిగి మరీ చాలా ఆసక్తిగా వినేవాణ్ణి- మా మామయ్య వాకింగ్ ఎన్సైక్లోపీడీయా!

నా ఉద్యోగ రీత్యా 2002 ప్రాంతంలో ఓ మూడేళ్లపాటు మద్రాస్ లో ఉండటం తటస్తించింది. ఆ సమయంలో వారంలో అధమం రెండు రోజులన్నా ఆయనని,మా అత్తయ్యని కలవడానికి వాళ్ళ ఇంటికి వెళ్ళేవాణ్ణి.

అత్తయ్య గురించి నాలుగు వాక్యాలు చెప్పాలి-సందర్భోచితం కాబట్టి.

బంధు మిత్రువులు ఎవరయినా చాలా ఆప్యాయంగా పలకరిస్తుంది- నాకు కాఫీ ఇష్టమని నేను అక్కడున్న గంట వ్యవధిలో రెండు సార్లు ఇచ్చేది-పంచదార వేయవలసిన అవసరం లేకుండా- అత్తయ్య చేతి ప్రేమతో కాఫీలో తీపి చేరి రుచిగా ఉండేది. గుండెలోవున్న ప్రేమని కప్పులో వేసి ఇచ్చేది అనుకుంటా "ఇప్పటికీ అదే ప్రేమ నేను ఎప్పుడు మద్రాస్ వాళ్ళ ఇంటికి వెళ్లినా"!

నా బెజవాడ జ్ఞాపకాల్లో ఒక ప్రత్యేక భాగమే రాసి అక్కడ చాలా వివరాలు ముచ్చటించటం జరిగింది-బెజవాడ పోరంకిలో 1951 లో పెట్టిన ఈ మామయ్యా వాళ్ళ సోప్ ఫ్యాక్టరీ గురించి. పేరు వసంత్ సోప్ వర్క్స -మా అత్తయ్య పేరు వసంత.డేటర్జెంట్ సోప్ పౌడర్,సోప్ బార్, బాడీ సోప్ (పియర్స్-pears సోప్ లాగానే) ఉండేది.అప్పుడు వసంత్ నగర్ పోస్ట్ అనేవారు.ఇప్పుడు ఆ పేరు మార్చిఉండాలి,బస్సులవాళ్ళు"సబ్బుల ఫ్యాక్టరీస్టాప్"గా పిలిచేవారు.

అయన తన చేతిరాతతో కొన్ని విషయాలు, జ్ఞాపకాలు రాయడం జరిగింది-దాదాపుగా ఇవి అన్నీ వ్యక్తిగతమైనవి- వారి కుటుంబానికి సంబంధించినవే. ఈయన ఎవరో మీకు తెలియకపోయినా- మీకు చదవటానికి ఆసక్తిగా ఉంటాయి.

ఎంచేతంటే ఆ రోజుల్లో మనుషులు ఎలా ప్రవర్తించేవారు, అలవాట్లు, ప్రేమలు, ఆప్యాయతలు, భూమి తగాదాల పరిష్కరణ, స్వార్ధపూరిత మనుషులు;అలాగే పెద్దవాళ్ళు అన్నా, విషయం పరిజ్ఞానం ఉన్నవాళ్లు అన్నా కుల మతాలకతీతంగా సమాజంలో గౌరవం మెప్పు ఎలా పొందేవారో-సమాజం వారిని ఎలా చూసేదో- మనకు అర్థం అవుతుంది.

దాదాపుగా ఆ రోజుల్లో సమాజం ఎలా ఉండేదో అద్దం పడుతుంది అయన రచనల్లో- ఆయన రాతల్లో ఆయన వ్యక్తిత్వం- తత్వం- నిర్మోహమాటం ప్రస్ఫుటంగా గోచరిస్తాయి.ఇప్పటివాళ్ళకి చాలా ఆశ్చర్యంగా ఉంటుంది- ఓహో మనుషులు అలాకూడా ఉండచ్చు అన్నమాట స్పృహకి వస్తుంది-మరీ ముఖ్యంగా ఇప్పటి యువతరానికి.

అలాగే ఇందులో ఆయన రాసిన కొన్ని విషయాలు, సంఘటనలు దాదాపుగా వందేళ్ల క్రితం సంగతులు -అంటే మనకు స్వాతంత్ర్యం రాక ముందువి అన్నమాట. స్వాతంత్ర పోరాట సమయంలో దాదాపుగా అందరికి దేశభక్తి విపరీతంగా ఉండేది- అలా నిస్వార్ధంగా వాళ్ళ వంతుగా ఎలా తోడ్పడ్డారో, వైద్యవృత్తిలో ఉంటూ లాభాపేక్ష లేకుండా ప్రజలకి సేవ చేయడమే ధ్యేయంగా (మా మామయ్య యొక్క మామయ్య గారి గురించిన వ్యాసంలో ఉంటుంది) ఎలా ఉండేవారో కళ్ళకు కట్టినట్టుగా కనపడుతుంది ఆయన రాతల్లో- అలాగే "ఆయుర్వేద వైద్యం" యొక్క ప్రాశస్త్యం చాలా విపులంగా రాయడం జరిగింది.

అప్పట్లో ఆ రచనలు పుస్తకాలుగా వత్తించడానికి ఎంచేతో వీలు చిక్కలా- అంచేత వారి పెద్ద కుమారుడు- "మా బావ అయిన సూరి వెంకటరమణ" వద్ద నుంచి అవి నేను తీసుకోవడం జరిగింది(మామయ్య స్వదస్తూరితో రాసిన కాగితాల దొంతరలు) అవన్నీ మళ్ళీ ఎత్తిరాసాను-ఇదిగో ఇలా పుస్తక రూపంలో తీసుకొచ్చే ఉద్దేశంతో- ఈ పుస్తకం మీకు ఖచ్చితంగా చదవటానికి ఆశక్తి కలిగిస్తుంది అని ఆశిస్తున్నా.

ఈ అవకాశాన్ని నాకు ఇచ్చిన మా బావకు సర్వదా కృతజ్ఞుణ్ణి.అవి వెలుగులోకి తేవాలని తాపత్రయ పడే వాళ్లలో నేనూ ఒకణ్ణి కనుక ఇది ఖచ్చితంగా నా అదృష్టంగా భావిస్తాను.ఈ విధంగా మామయ్య మీద ఉన్న ప్రేమని వ్యక్తం చేసుకుంటూ ఆయనకు ఈ పుస్తక రూపంలో నివాళులు అర్పిస్తున్నా.

**మామయ్య 25-09-2014 లో తన 94వ ఏట స్వర్గస్తులయినారు.**

**మీ మూర్తి**

**(చతుర్వేదుల వెంకట సత్యనారాయణ మూర్తి)**

**విషయ సూచిక**


**1.చిన్నప్పటి జ్ఞాపకాలు**

**2.మా కుటుంబం**

**3.మా తాతయ్య**

**4.మా మామయ్య**

**5.మా రామమూర్తి మామయ్య**

# మా తాతయ్య

**మా తాతయ్య**

**బొమ్మకంటి లచ్చయ్య గారు**

**(1845-1933)**

**బొమ్మకంటి లచ్చయ్యగారు మా మాతామహుడు. ఆయన ఒక అపూర్వ వ్యక్తి ఒక ఆదర్శ పురుషుడు. అయన గురించి చెప్పాలన్నా, రాయాలన్నా చాలా వుంది.ఓకే ఇంట్లో మేము కలిసి వుండటమేకాకుండా, చిన్నప్పటినుంచి నేను ఆయనకు సన్నిహితంగా వుండేవాడిని. ఏ చిన్నపని వున్నా నా చేత చేయించేవాడు. మా అన్నయ్య శాస్త్రులు (సుబ్రహ్మణ్య శాస్త్రి) కి కొంచెం కాలు అవిటి ఉండేది. అదీకాక, నా తమ్ముళ్లు, పూర్ణానందం ఆరు ఏళ్ల వాడు, రామం మూడు ఏళ్ల వాడు అవడంతో ఇంటిపనులు ఏవి వున్నా నాకు చెప్పేవారు. నాకు అన్నిపనులు అయన నేర్పేవాడు. మా పెత్తల్లి రామమ్మ గారు వాళ్ళు వూరికి దూరంగా పొలంలో ఉండేవారు. మా పెత్తల్లి కొడుకు  పురుషోత్తం రాజమండ్రిలో చదువుకుంటూ వుండేవాడు. నా చెల్లెల్లు, శకుంతల పది ఏళ్ళు , నా ఆఖరి చెల్లెలు అన్నపూర్ణ ఆయనపోయే ముందు (మూడు రోజుల ముందు) పుట్టింది. అందుచేత అయన దౌహిత్రు లందరిలో నేను కూడా కూడా ఉండటంతో ఆయనతో నాకు అత్యంత సాన్నిహిత్యం ఉండేది.**

**మా తాతయ్యని గురించి నాకు తెలిసినన్ని వివరాలు మిగతావాళ్లకు తెలియదని, ఆ వివరాలు జాగ్రత్తగా పొందుపరచమని మా అన్నయ్య పురుషోత్తమ్ ఎప్పుడూ అంటూ ఉండేవాడు. అయన కోరికపై నేను ఇది రాయడానికి పూనుకున్నాను.**

**మా తాతయ్య అమలాపురం తాలూకా బెండ మూర్లంకలో పుట్టినట్టు, స్వయంగా మా తాతయ్య చెప్పగా విన్నట్టు జ్ఞాపకం. సిపాయి తిరుగుబాటు నాటికి ( 1857) తాను చిన్నవాడినని అయన అనేవాడు. అందుచేత  అయన బహుశా 1845-50 ప్రాంతంలో జన్మించి ఉండాలి. ఆయన చనిపోయేనాటికి ౧౯౩౩ లో అయన వయస్సు ౮౫/౮౮ సంవత్సరాలు అనేవారు. సన్నగా, బక్కపలచగా పొట్టిగా, దబ్బపండు రంగు లో ఉండేవాడు. అయన ఎప్పుడూ,చురుకుగా ఏదోపని చేస్తూ ఉండేవాడు. అయన సుస్తీ పడటం నేను ఎరగను. ఆయనతో నడవ కలిగిన వాళ్ళు చాలా కొద్దిమంది. చిన్నకారు అంతా ఆయన్ని గోల్డెన్ స్పారో అనేవారు.**

మా తాతయ్య తల్లి భాగమ్మ, తండ్రి వెంకట శాస్త్రి. మా తాతయ్యకి ఒక సవతి అన్నగారు ఉండేవారట. అయన పేరు నాకు గుర్తులేదు. మా మేనమామకు అడగాలని నాకు ఎప్పుడూ తోచలేదు. మా తాతయ్య సవతి అన్న కూతురు విశాల నరసమ్మగారు అని ఉండేది. వాళ్ళది మొసలపల్లి. ఆవిడకు కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం అని ఇద్దరు కొడుకులు. వాళ్ళు మా ఇంటికి తరచూ వచ్చేవారు. కృష్ణమూర్తి మూగవాడు. సుబ్రహ్మణ్యం కుటుంబం నా చిన్నప్పుడు వైద్యం నిమిత్తం మా పడమటింట్లో కాపురం ఉండేవారు కొన్నినెలల. సుబ్రహ్మణ్యం మా ఇళ్లలో కార్య కరామతులకు తప్పక వచ్చేవాడు. మా తమ్ముడు రామం పెళ్లి ౧౯౭౫ లో రాజమండ్రి లో అయింది. ఆ పెళ్ళికి వచ్చాడు. తరువాత మళ్ళీ కలవలేదు. అతనిని చనువుగా సుబ్రహ్మణ్యం అన్నత్య అని పిలిచేవాళ్ళం. అయన భార్య కామేశ్వరి, కూతురు సీత.

మా తాతయ్యకు ఇద్దరు చెల్లెల్లు, ఇద్దరు తమ్ముళ్లు. వరసక్రమంగా వాళ్ళు- ౧. లచ్చయ్యగారు, ౨. పెద్దమంగమ్మగారు, ౩. వెంకటరత్నం గారు. ౪. చిన్న మంగమ్మగారు. ౫.సాంబయ్య ఆగారు. తండ్రి చనిపోయిన తరువాత కుటుంబ బాధ్యత మా తాతయ్య మీద పడినట్లు తెలుస్తోంది. అయన తమ్ముడు వెంకట రత్నంగారు తమ పినతండ్రికో, పెత్తండ్రికో దత్తుడు. కుటుంబ బాధ్యత తనమీద ఉన్నందున అయన తన పెళ్లి ఆలస్యంగా చేసుకున్నట్లు తెలుస్తుంది. చెల్లెలు పెద్దమంగమ్మ గారికి ఆ తర్వాత తమ్ముడు వెంకటరత్నం గారికి పెళ్లిళ్లు చేసిన తర్వాతే తాను వివాహం చేసుకుని ఉండాలి.

పెద్దమంగమ్మగారి భర్త దుర్భ సుబ్బయ్య గారు నిడదవోలు కి రెండు మైళ్ళ దూరంలో వున్న రావిమెట్ట నివాసి. ఆయనకు రామమ్మ (చెరుకుపల్లి లక్ష్మయ్య గారి భార్య) హనుమాన్లు( సుబ్బమ్మ) గారి భర్త, వెంకటరత్నం గారి అల్లుడు) మహాలక్ష్మి (గాడేపల్లి నరసింహ గారి భార్య)పేరమ్మ (జోశ్యభట్ల వెంకటేశ్వర్లు గారి భార్య) సంతానం. ఇంకో కూతురి పేరు తెలియదు. ఆవిడ వెంకటరత్నం గారి రెండవ భార్య. వారి సంతానం సుబ్బగారి రామమూర్తి శర్మ గారు. పెద్ద ఆయుర్వేద వైద్యుడు.

మా తాతయ్య పెద్ద మేనకోడలు చెరుకుపల్లి రామమ్మగారి పెద్దకొడుకు సత్యనారాయణ, మా తాతయ్య పెద్దకూతురు వయస్సు వాడు. ఇది నాకు చాలాకాలం అర్ధం కాలేదు. మా తాతయ్య తన చెల్లెలు, తమ్ముళ్ల వివాహం జరిగిన చాలా కాలం తర్వాత ఆలస్యంగా బహుశా నలభై ఏళ్ళు వచ్చాక వివాహం జరిగింది, మా మేనమామ చెప్పడం వల్ల తెలిసింది. సంతానం కూడా ఆలస్యంగా కలగడంతో తన పిల్లలాల్ కంటే తన చెల్లెలి మనుమలు పెద్దవాళ్లు అవడం జరిగింది.

మా తాతయ్య భార్య అన్నపూర్ణమ్మ(మా అమ్మమ్మ) చెరుకుపల్లి లక్ష్మయ్య గారి చెల్లెలు. అంటే తన మేనకోడలు (పెద్దమంగమ్మ గారి కూతురు) ఆడపడుచు. మా తాతయ్యకు ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు. ఒక కొడుకు. పెద్ద కూతురు రామమ్మగారు.

ఆమె భర్త విఠాల సత్యనారాయణ మూర్తి గారు, అట్లపాడు రేవు దగ్గరలో రెండున్నరఎకరాల స్థలంలో ఇల్లు కట్టుకుని సున్నం బట్టీ వ్యాపారం, నాపరాళ్ళు వ్యాపారం చేస్తూ ఉండేవారు. ఇదికాక ఆయనకి పన్నెండు ఎకరాల మాగాణి భూమి కూడా ఉండేది. సంపన్న గృహస్తు కిందే పరిగణించేవారు ఆ రోజుల్లో. వారికి ఇద్దరు సంతానం. కొడుకు పురుషోత్తమ్, కూతురు సుబ్బలక్ష్మి .

రామమ్మగారు (మా పెత్తల్లి) ౧౯౨౯ లో చిన్నవయస్సులోనే చనిపోయింది. ఆవిడ గురించి నాకు ఎక్కువగా తెలియదు. మా అన్నయ్య పురుషోత్తనానికే చిన్నవయసు. అందుచేత వాళ్లిద్దరూ మా అమ్మదగ్గరే కొంతకాలం పెరిగారు. ఓకే వూళ్ళో ఉండటం మూలాన . ఆ కారణం చేత మేమందరం ఆయన్ని (పురుషోత్తం) స్వంత అన్నగానే చూసేవాళ్ళం. అల్లాగే అయన చెల్లెలు సుబ్బలక్ష్మి కూడా మాతో బాటే పెరిగింది. వాళ్ళిద్దరితో మాకు గాఢమైన అనుబంధం ఏర్పడింది. చివరివరకు వాళ్ళిద్దరితో మా అనుబంధం కొనసాగింది. పురుషోత్తం 1988 లో హైదరాబాద్ లోనూ. సుబ్బులు 1989 లో బెజవాడ లోనూ చనిపోయారు.

మా తాతయ్య రెండవ సంతానం సీతమ్మగారు ( మా అమ్మ) రాజమండ్రి వాస్తవ్యులు సూరి రాజగోపాలం గారి తో వివాహం అయ్యాక కొంత కాలానికి ఆయనకూడా నిడదవోలు లో స్థిరపడ్డారు. అందుచేత మేమంతా పుట్టి పెరిగింది నిడదవోలు లోనే. వారి సంతానం వరసగా- ౧. వెంకట సుబ్రమణ్య శాస్త్రి ఇరవై ఏడవ ఏట ౧౯౪౫ లో అవివాహటిడుగా చనిపోయాడు) ౨. రామకృష్ణ శాస్త్రి (నేను) త్రీ. శకుంతల. ౪. పూర్ణానందం. ౫. జానకీరామశాస్త్రి. ౬. అన్నపూర్ణ. మా నాన్న 1955 ఆగష్టు లోనూ. మా అమ్మ 1980 మే నెలలోనూ చనిపోయారు. మా తాతయ్య మూడవ సంతానం బూరి శాస్త్రిగా ప్రఖ్యాతుడైన వెంకట నరసింహంగారు. ఆయన ఆఖరి సంతానం కనుక కాస్త గారాబంగా పెరిగి ఉంటాడు. ఇద్దరు అక్కలతో అయన చాలా అన్యోన్యంగా ఉండేవాడు. ఆయనకి ప్రేమాభిమానాలు చాలా ఎక్కువ. తన మేనమామ కూతురు జానీకమ్మా తో వివాహం అయింది. వాళ్ళిద్దరిమధ్య అన్యోన్యత అంతంతమాత్రం. సంతానం లేకపోవడం పెద్ద లోటు. అందువల్లనే అయన తన మేనల్లుళ్లు మేన కోడళ్ల మీద చాలా వాత్సల్యం అనురాగం చూపించేవాడు. ఆమె కూడా (మా అత్త) మేమంటే చాలా ప్రేమగా ఉండి మా బాగోగులు చూస్తూ ఉండేది. ఆమె పిల్లలు లేరనే దిగులు, భర్త నిరాదరణ తో బాధపడుతూనే ౧౯౫౪ లో చనిపోయింది. ఆ తర్వాత అయన సరస్వతి గారిని (కర్నూల్ జిల్లా నంద్యాల వారు ) రెండవ వివాహం చేసుకున్నారు. ఆయుర్వేద వైద్యం లో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు. మా కుటుంబానికి పెద్ద అండగా ఉండేవాడు. మా అన్నయ్య పురుషోత్తం మీద ఆయనకు విపరీతమైన అభిమానం ఉండేది. మా మామయ్య కి, మా అన్నయ్యకి వున్నది కేవలం అభిమానమే కాకూండా, చాలా వరకు వాళ్ళిద్దరిదీ ఓకే తత్త్వం.